క్లుప్తంగా

విద్యుత్ సరఫరాకు అంతరాయం రేపు

మర్రిపాలెం: జోన్–2 ఎస్ఎస్‌టీఎల్ పరిధిలో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఈఈ టీకే నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. 11కేవీ మాధవధార–1, 2 ఫీడర్ల నిర్వహణ పనుల్లో భాగంగా మాధవధార వుడా కాలనీ, కనకమహాలక్ష్మి టెంపుల్ రోడ్డు, శ్రీశాంతి ల్యాండ్‌మార్క్ ఏరియా, విజేత మార్ట్ ఏరియా, మాధవధార, అంబేడ్కర్ కాలనీ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని, ప్రజలు గమనించాలని కోరారు.

ఆలయాల్లో అన్నసమారాధనలు


అన్నప్రసాదం వడ్డిస్తున్న రెయ్యి వెంకటరమణ, పేడాడ రమణికుమారి

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డులోని పలు ఆలయాల్లో బుధవారం రాములోరి కల్యాణం వైభవంగా నిర్వహించారు. భీంనగర్ కొండపైన ఉన్న సాయిబాబా ఆలయం, గాంధీనగర్–2 హరిహర క్షేత్రంలో కొలువైన సీతారాములకు, మాధవధార వుడా కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో శ్రీలక్ష్మీగణపతి ఆలయంలో ఏర్పాటు చేసిన స్వామివారి కల్యాణాల్లో కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. అనంతరం పలు ఆలయాల్లో ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో భక్తులకు ఆయన అన్నప్రసాదం వడ్డించారు. వైఎస్సార్‌సీపీ మహిళా నాయకురాలు పేడాడ రమణికుమారి, పలువురు నాయకులు పాల్గొన్నారు.

వనితా వాకర్స్ సారె సమర్పణ


సీతమ్మకు సారె సమర్పిస్తున్న వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో బుధవారం నిర్వహించిన సీతారాముల కల్యాణం సందర్భంగా అమ్మవారి తరఫున వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు సారె సమర్పించారు. క్లబ్ అధ్యక్షురాలు పి.ప్రభావతి ఆధ్వర్యంలో మహిళలు ఊరేగింపుగా సారె తీసుకునివచ్చారు. చీర, పంచె, చలివిడి, ఐదు రకాల స్వీట్లు, ఆరు రకాల మధుర ఫలాలు, పూలదండలు, పసుపు, కుంకుమ, గాజులు, పారాణి, అరటి గెల, కొబ్బరికాయలు, కొబ్బరి బొండాలు, తమలపాకులతో కూడిన సారెను మంగళవాయిద్యాల నడుమ భక్తిప్రపత్తులతో సీతమ్మకు సమర్పించారు.

ఘనంగా ముత్యమాంబ తొలేళ్ల సంబరం


అమ్మవారి ఘటాల ఊరేగింపులో భక్తులు

కంచరపాలెం: గవర కంచరపాలెం ముత్యమాంబ అమ్మవారి నవరాత్రి మహోత్సవాలు గ్రామాభ్యుదయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు దాడి సూర్య అప్పారావు, మళ్ల శంకరరావు ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గురువారం తెల్లవారుజాము నుంచి అమ్మవారి ప్రత్యేక దర్శనాలతో ప్రధాన జాతర నిర్వహించనున్నారు. బుధవారం రాత్రి నగర ప్రాంతాల మీదుగా అమ్మవారి ఉత్సవ ప్రతిమల ఊరేగింపు కనుల పండువగా సాగింది. భక్తులు తలపై అమ్మవారి ప్రతిమలను జగదాంబ కూడలి, అల్లిపురం, జ్ఞానాపురం, రామ్మూర్తిపంతులుపేట ప్రాంతాల మీదుగా కంచరపాలెం పుట్టబంగారం అమ్మవారి మూలవిరాట్ వద్దకు చేర్చారు. ఉత్సవంలో పలువురు ప్రముఖులు అమ్మవారి ఘటాలను తలపై ఉంచి మొక్కులు తీర్చుకున్నారు. పాలకవర్గ సభ్యులు భీశెట్టి శ్రీనివాసరావు, పొలమరశెట్టి ఉమారమేష్, శరకం శ్రీనివాసరావు, దాడి వెంకటరావు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

నేడు ప్రధాన జాతర

కంచరపాలెం నేతాజీ ఫ్లైఓవర్ కూడలిలో వెలసిన ముత్యమాంబ ఆలయంలో గురువారం జరిగే ప్రధాన జాతరకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు నిర్వాహకులు తెలిపారు. ఆలయాన్ని సుందరంగా విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ప్రసాదాలు, మజ్జిగ, శీతలపానీయాలు అందించేందుకు చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. భక్తులు ప్రధాన జాతరకు రావాలని ఉత్సవ కమిటీ సభ్యులు కోరారు.

ప్రజల పక్షాన వైఎస్సార్‌సీపీ


53వ వార్డులో కరపత్రం అందించి ఓటు అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో కె.కె.రాజు, బర్కత్ అలీ

- అందరి హృదయాల్లో సీఎం జగన్‌కు సుస్థిర స్థానం
- 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు
- ఎన్నికల ప్రచారానికి విశేష ఆదరణ

మర్రిపాలెం: వైఎస్సార్‌సీపీ ఎల్లప్పుడూ ప్రజల పక్షానే ఉంటుందని పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు అన్నారు. 53వ వార్డు గ్రీన్ గార్డెన్స్, హౌస్సింగ్ నగర్ పరిసర ప్రాంతాల్లో బుధవారం కార్పొరేటర్ బర్కత్ అలీ ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రతి గడపలో, ప్రతి చోట తమకు విశేష స్పందన లభిస్తోందన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ప్రతి ఒక్కరి హృదయాల్లో సుస్థిర స్థానం సంపాదించుకున్నారని చెప్పారు. ఎంతమంది వచ్చినా ఆయనను ఢీకొట్టలేరన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై వారి ఓటు వేసి తన విజయానికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి, జేసీఎస్ కన్వీనర్ అమర్‌రెడ్డి, పార్టీ ముస్లిం మైనారిటీ రాష్ట్ర నాయకుడు షేక్ బాబ్జి, ధీరజ్ కుమార్ రెడ్డి, పార్టీ నాయకులు రామలక్ష్మి, సుశీల, హనుమంతు, ఝాన్సీ, నబి, బాలాజీ, అన్సర్ వలీ, వలీ, జయలక్ష్మి, సంపత్, భాను, ఆదిలక్ష్మి, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీలో చేరిక..

జీవీఎంసీ 53వ వార్డులోని గ్రీన్ గార్డెన్స్‌కు చెందిన ముగ్గురు బర్కత్ అలీ ఆధ్వర్యంలో, కె.కె.రాజు సమక్షంలో వైఎస్సార్‌సీపీలో చేరారు. పార్టీ సిద్ధాంతాలు నచ్చి, సీఎం జగన్ ప్రజలకు అందిస్తున్న పాలన మెచ్చి పార్టీలో చేరినట్లు వారు తెలిపారు. వారికి కండువా కప్పి కె.కె.రాజు సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీ విజయానికి పూర్తిస్థాయిలో పనిచేయాలని కోరారు.

'ఫ్యాన్'కు ఓటేద్దాం.. సంక్షేమాన్ని కొనసాగిద్దాం

సీతంపేట: వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజుకు మద్దతుగా 25వ వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ ఆధ్వర్యంలో బుధవారం సీతంపేట రెల్లి వీధి, బీటీఆర్ కాలనీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు అందజేసి నియోజకవర్గంలో, 25వ వార్డులో జరిగిన అభివృద్ధిని ప్రజలకు వివరించారు. రూ.6 కోట్లతో వార్డులో రహదారులు, డ్రెయిన్లు, వాకింగ్ ట్రాక్, ఓపెన్‌జిమ్ అభివృద్ధి చేయగా.. మరో రూ.2 కోట్లతో రెల్లి వీధిలో కల్యాణ మండపం, హిందూ ముస్లిం కాలనీలో సామాజిక భవనం నిర్మిస్తున్నట్టు తెలిపారు. ఐదేళ్లుగా సంక్షేమ పథకాలు ప్రతి గడపకు చేర్చిన తీరుని వివరించారు. ఇటువంటి అభివృద్ధి, సంక్షేమం కొనసాగాలంటే మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని చేయాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా కె.కె.రాజును, ఎంపీగా బొత్స ఝాన్సీని గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో కమ్మిల నవీన్‌రాజు, చుక్క అనిల్‌రెడ్డి, సచివాలయ కన్వీనర్లు సానబోయిన సురేష్, పోతిబంతి హరికృష్ణ, బొమ్మాళి రవి, శేఖర్, గోవిందమ్మ, పద్మ, సంధ్య, వీరమ్మ, జయ, అప్పన్న, గౌరినాయుడు, సన్నీ, జగన్, బూత్ కన్వీనర్లు, కో కన్వీనర్లు, గృహసారథులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.


సీతంపేట రెల్లి వీధిలో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్

అఖండ మెజారిటీతో గెలిపిద్దాం

కంచరపాలెం: వైఎస్సార్‌సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీ, ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజులను అఖండ మెజారిటీతో గెలిపించుకుందామని కార్పొరేటర్ కె.వి.ఎస్.శశికళ పిలుపునిచ్చారు. 55వ వార్డు కంచరపాలెం, ధర్మానగర్, తాటిచెట్లపాలెం ప్రాంతాల్లో 54 ,55 వార్డుల ఎన్నికల పరిశీలకుడు బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి నేతృత్వంలో బుధవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే సంక్షేమం–అభివృద్ధి సాధ్యమన్నారు. సార్వత్రిక ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించాలని కోరారు. ప్రతి ఇంటికి వెళ్లి కరపత్రం అందించి ఓటు అభ్యర్థించారు. పార్టీ వార్డు అధ్యక్షుడు కాయిత పైడి రత్నాకర్, బొడ్డేటి గంగామహేష్, సిద్ధార్థ, డి.శ్రీనివాసరావు, ఆళ్ల గోపి, సొండి సురేష్, గౌస్, శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ధర్మానగర్‌లో ఓటు అభ్యర్థిస్తున్న కార్పొరేటర్ శశికళ, బాకీ శ్యామ్‌కుమార్‌రెడ్డి

గెలుపే ధ్యేయంగా సైనికుల్లా పనిచేయండి


కార్పొరేటర్లు, పార్టీ నాయకులకు దిశానిర్దేశం చేస్తున్న కె.కె.రాజు

- ప్రజల్లోకి విస్తృతంగా సంక్షేమాభివృద్ధిని తీసుకెళ్లండి
- వైఎస్సార్‌సీపీ 'ఉత్తర' ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపు

సీతమ్మధార: సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ విజయమే ధ్యేయంగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని పార్టీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు పిలుపునిచ్చారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఉత్తర పార్టీ కార్యాలయంలో బుధవారం కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, వార్డు అధ్యక్షులు, ముఖ్య నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లి పార్టీ గెలుపునకు కృషి చేయాలని కోరుతూ దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో పార్టీ ఉత్తర ఎన్నికల పరిశీలకులు చొక్కాకుల వెంకటరావు, బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరరావు, ఎన్నికల పరిశీలకులు పీలా వెంకటలక్ష్మి, స్టాండింగ్ కమిటీ సభ్యులు కంటిపాము కామేశ్వరి, కార్పొరేటర్లు కె.అనిల్‌కుమార్‌రాజు, సాడి పద్మారెడ్డి, సారిపల్లి గోవింద్, ఆళ్ల లీలావతి, పి.ఉషశ్రీ, వి.ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, బర్కత్ అలీ, కె.వి.ఎస్.శశికళ, కో–ఆప్షన్ సభ్యుడు సేనాపతి అప్పారావు, మాజీ కార్పొరేటర్లు రవిరాజ్, జి.వి.రమణ, బులుసు జగదీష్, మువ్వల పోలారావు, పామోటి బాబ్జీ, వార్డు అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, పైడి రమణ, నీలి రవి, కె.వి.రత్నాకర్, దుప్పలపూడి శ్రీను, నాయకులు బొగ్గ శ్రీను, డైరెక్టర్లు, మండల ఇన్‌చార్జులు తదితరులు పాల్గొన్నారు.

రామాయణం మానవేతిహాసం

సీతంపేట: రామాయణం మానవీయ విలువలకు పట్టం కట్టిన మహాకావ్యమని రచయిత డాక్టర్ డి.వి. సూర్యారావు పేర్కొన్నారు. సహృదయ సాహితి సంస్థ ఆధ్వర్యంలో బుధవారం రాజేంద్రనగర్ ప్రిజమ్ కళాశాలలో జరిగిన సాహిత్య కార్యక్రమంలో 'రామాయణం–సమాజం' అనే అంశంపై ఆయన ప్రసంగించారు. ఆదికవి వాల్మీకి కరుణార్ద్ర హృదయం నుంచి శోకం శ్లోకంగా వెలువడి తరతరాలకు ఆరాధనీయమైన రామాయణ గ్రంథంగా ఉద్భవించిందన్నారు. రామాయణ కావ్యం కుటుంబ గాథ అని, అయోధ్యలో, కిష్కింధలో సోదర సంబంధాలు ఎలా ఉన్నాయో చిత్రించారన్నారు. ఆ కావ్యం ప్రదర్శించిన దాంపత్య జీవితం ఏ సమాజానికైనా ఆదర్శమని చెప్పారు. సత్యనిష్ఠ, ధర్మ దృష్టి, మహిళపై గౌరవం, పాలకుడి రుజువర్తనం, క్షమాగుణం, సంయమనం విలువలను రామాయణం ప్రబోధించిందని తెలిపారు. మితిమీరిన కామప్రవృత్తి ఎలా వినాసనకరమో రామాయణం చెబుతుందన్నారు. శేఖరమంత్రి ప్రభాకర్ మాట్లాడుతూ రామాయణం వేద స్వరూపమని, రాముడి గుణగణాలు ఆదర్శంగా ఆచరించదగినవని పేర్కొన్నారు. కార్యక్రమంలో కె.జి.వేణు, ఎస్.విజయ్‌కుమార్, కె.వి.ఎస్.మూర్తి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న రచయిత సూర్యారావు

అంతా రామమయం

- అంగరంగ వైభవంగా శ్రీరామనవమి వేడుకలు
- నేత్రపర్వంగా సీతారాముల కల్యాణం
- తిలకించి తరించిన భక్తజనం
- ఆలయాల్లో విశేష పూజా కార్యక్రమాలు


వైభవ వెంకన్న సన్నిధిలో సీతారామలక్ష్మణులు


సీతంపేటలో సీతారాముల కల్యాణంలో పాల్గొన్న కె.కె.రాజు, చొక్కాకుల వెంకటరావు

సీతంపేట: ఉత్తర నియోజకవర్గంలో బుధవారం శ్రీరామనవమి వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా సీతారాముల కల్యాణ మహోత్సవం నేత్రపర్వంగా నిర్వహించారు. ఆలయాలన్నీ రామ నామస్మరణతో ధ్వనించాయి. విశేష పూజలు, అన్నదానాలు నిర్వహించారు. పానకం, వడపప్పు తీర్థప్రసాదాలుగా భక్తులకు పంచిపెట్టారు.

సీతంపేటలో కనుల పండువగా..

వైఎస్సార్‌సీపీ నాయకుడు, సింహాచలం దేవస్థానం ట్రస్టు బోర్డు సభ్యుడు సంపంగి శ్రీనివాసరావు, మంగమ్మ దంపతుల ఆధ్వర్యంలో సీతంపేట పార్వతీశ్వరాలయం వద్ద రాములోరి కల్యాణం వైభవంగా జరిగింది. అద్భుతంగా తీర్చిదిద్దిన కల్యాణ వేదికపై పట్టుపీతాంబరాలు, ఆభరణాలతో సర్వాంగ సుందరంగా అలంకరించిన సీతారాముల పంచలోహ ఉత్సవమూర్తులకు అర్చకుడు గంగవరపు భాస్కరశర్మ నేతృత్వంలో కల్యాణం కనుల పండువగా సాగింది. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు పూజలు చేశారు. భక్తులు పెద్ద సంఖ్యలో కల్యాణాన్ని తిలకించారు. సాయంత్రం సీతారాముల ఉత్సవ మూర్తులను మేళతాళాలతో పురవీధుల్లో ఊరేగించారు. మహిళలు పసుపు, కుంకుమ, పండ్లు, పువ్వులు, పలు రకాల మిఠాయిలతో సారె సమర్పించారు .

లలితా పీఠంలో వైభవోపేతంగా..

లలితానగర్ శ్రీలలితా పీఠంలో పండితుల వేదమంత్రాల నడుమ సీతారాముల కల్యాణం వైభవోపేతంగా జరిగింది. పెద్ద ఎత్తున భక్తులు కల్యాణాన్ని వీక్షించి, అన్నప్రసాదం స్వీకరించారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

రాములోరి కల్యాణంలో కె.కె.రాజు దంపతులు

సీతమ్మధార: సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో లోక కల్యాణార్థం సీతారాముల కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, సుమ దంపతులు, సి.ఎస్.వర్మ, దివ్య దంపతులు పాల్గొని కల్యాణం జరిపించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ఆక్సిజన్ టవర్స్‌లో శాస్త్రోక్తంగా..

సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్‌లో కమిటీ ఆధ్వర్యంలో అర్చకుడు సీతారాములు సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా జరిపారు. కమిటీ జనరల్ సెక్రటరీ పి.దేవారాజ్‌రెడ్డి, కోశాధికారి, వై.రాంబాబు, జాయింట్ సెక్రటరీ గణేష్ వర్మ, బోని అప్పారావు, అప్పలరాజు శ్రీరామనవమి వేడుకలు నిర్వహించారు. సీతారాములకు మేడపాటి రమేష్‌రెడ్డి దంపతులు వస్త్రాలు, ముత్యాలు సమర్పించారు.

- నార్త్ ఎక్స్‌టెన్షన్ మహాగణపతి, ప్రసన్న వేంకటేశ్వరస్వామి, అయ్యప్ప, షిర్డీసాయి దేవాలయంలో ప్రధాన అర్చకుడు రాజాస్వామి ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు.
- నక్కవానిపాలెం రామాలయంలో గ్రామ కమిటీ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు, టీడీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి శ్రీభరత్, బీజేపీ ఎమ్మెల్యే అభ్యర్థి పి.విష్ణుకుమార్‌రాజు పాల్గొన్నారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. గ్రామ కమిటీ అధ్యక్షుడు డి.వి.ఎస్.ప్రసాద్‌రెడ్డి, సెక్రటరీ దిలీప్‌కుమార్‌రెడ్డి, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.
- ఏఎస్సార్ నగర్‌లోని 108 అడుగుల అభయాంజనేయ స్వామి ఆలయంలో శ్రీరామ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో రాములోరి కల్యాణం, మధ్యాహ్నం 3 గంటలకు విద్యార్థులచే శ్రీరామ కీర్తనలు, సాయంత్రం స్వామివారి పల్లకీ సేవ, పట్టాభిషేకం నిర్వహించారు.
- గాంధీనగర్ అభయాంజనేయ స్వామి ఆలయంలో సీతారాముల కల్యాణం ఘనంగా జరిపారు.
- గణేష్‌నగర్ త్రిముఖ విఘ్నేశ్వర పంచాయతన శ్రీ కోదండ రామస్వామి ఆలయంలో ఏడిద గురునాథ్ శర్మ బృందం నాని స్వామి సీతారాముల కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఆలయ చైర్మన్ టి.ఎస్.ఎన్.మూర్తి, సభ్యులు పాల్గొన్నారు.

మురళీనగర్ రామాలయంలో కమనీయంగా..

మురళీనగర్: మురళీనగర్ రామాలయంలో సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా జరిగింది. ఆంజనేయ సహిత సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వేదికపైకి తోడ్కొని వచ్చి పూజలు చేశారు. అర్చకుడు భానుమూర్తితో కూడిన బృందం ఆధ్వర్యంలో కమనీయంగా కల్యాణం జరిపించారు. ఆలయ నిర్వహణ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు టి.ఎస్.రెడ్డి, సనపల వరప్రసాద్‌ల పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి. వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, యలమంచిలి నియోజకవర్గ ఇన్‌చార్జి రొంగలి జగన్నాథం, వివిధ పార్టీల నాయకులు, అభ్యర్థులు సీతారామలక్ష్మణులను దర్శించుకున్నారు.

- పట్టాభిరెడ్డితోటలోని దాసాంజనేయ స్వామి ఆలయంలో నిర్వహణ కమిటీ, ప్రధానార్చకుడు ఆరవిల్లి సీతారామాచార్యులు ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం కనుల పండువగా జరిగింది. భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.

వైభవుడి దివ్యక్షేత్రంలో విశేషంగా..

కప్పరాడ ఎన్‌జీజీవోస్ కాలనీలోని వైభవ వేంకటేశ్వర స్వామి ఆలయంలో శ్రీరామనవమి వేడుకలు వైభవంగా నిర్వహించారు. ఉదయం స్వామికి సుప్రభాత సేవ అనంతరం ప్రత్యేకంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం సీతారామలక్ష్మణుల ఉత్సవ విగ్రహాలను ప్రత్యేక వేదికపై ఆశీనులను గావించి ఆలయ అర్చకులు వాసు, శేషు స్వాముల ఆధ్వర్యంలో విశేషంగా కల్యాణం నిర్వహించారు. ఆలయ ఈవో బండారు ప్రసాద్ పర్యవేక్షించారు.

- పట్టాభిరెడ్డితోటలోని వానప్రస్థ వృద్ధాశ్రమంలో నిర్వాహకుడు రొబ్బి శ్రీనివాస్ ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం ఘనంగా నిర్వహించారు. బొమ్మల కొలువు ఏర్పాటు చేశారు. 500 మందికి విందు భోజనం అందించారు. కేజీహెచ్ ఆర్థోపెడిక్ డిపార్ట్‌మెంట్ హెడ్ డాక్టర్ పి.శివానంద దంపతులు పాల్గొన్నారు. స్థానిక భక్తులు, ఆశ్రమ వృద్ధులు కల్యాణాన్ని వీక్షించి తరించారు.

55, 45 వార్డుల్లో ఘనంగా వేడుకలు

తాటిచెట్లపాలెం: జీవీఎంసీ 55వ వార్డు రెడ్డి తాటిచెట్లపాలెంలోని బాలభక్త సమాజం రామాలయంలో నూనెల పోలారావు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించిన శ్రీరామనవమి వేడుకల్లో వైఎస్సార్‌సీపీ ఉత్తర ఎమ్మెల్యే అభ్యర్థి కె.కె.రాజు ముఖ్య అతిథిగా పాల్గొని పూజలు చేశారు. అనంతరం 45వ వార్డు తాటిచెట్లపాలెం జాతీయ రహదారిలో పెట్రోల్ బంక్ పక్కన గల కోదండ రామాలయంలో జరిగిన వేడుకల్లో కె.కె.రాజు పాల్గొన్నారు. ఆయన చేతుల మీదుగా భక్తులకు అన్నదానాలు చేశారు. ఈ కార్యక్రమాల్లో వీకేపీసీపీఐఆర్ చైర్మన్, ఉత్తర ఎన్నికల పరిశీలకుడు చొక్కాకుల వెంకటరావు, వార్డు అధ్యక్షులు పైడి రమణ, దుప్పలపూడి శ్రీనివాసరావు, పార్టీ నాయకులు బొడ్డేటి గంగామహేష్, యడ్ల శ్రీనివాసరెడ్డి, పి.ఎల్.ఎన్.పట్నాయక్, తదితరులు పాల్గొన్నారు.

సీతారాములకు ప్రత్యేక పూజలు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం పరిధి సంజీవ్ కాలనీ, శాంతినగర్ కొండవాలు ప్రాంతాల్లోని సీతారామాలయాల్లో ఆయా గ్రామ సంఘాల ఆధ్వర్యంలో సీతారాముల కల్యాణం వైభవంగా జరిపించారు. జీవీఎంసీ డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్ దంపతులు కల్యాణ వేడుకల్లో పాల్గొని సీతారాములకు ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధన కార్యక్రమాలను ఆయన ప్రారంభించారు. గ్రామ కమిటీ సభ్యులు, పార్టీ నాయకులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

సీతారామచంద్రస్వామికి ప్రత్యేక పూజలు

మర్రిపాలెం: జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్–2లోని హరిహర క్షేత్రంలో కొలువైన సీతారామచంద్రస్వామి ఉత్సవాల్లో భాగంగా యువసేన సేవా సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం సీతారాముల కల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు కల్యాణాన్ని తిలకించారు.


గాంధీనగర్–2లో పూజలందుకున్న సీతారామచంద్రస్వామి


సీతమ్మధార క్షత్రియ కల్యాణ మండపంలో కల్యాణంలో పాల్గొన్న కె.కె.రాజు దంపతులు


ఆక్సిజన్ టవర్స్‌లో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


లలితానగర్ లలితా పీఠంలో నిర్వహిస్తున్న సీతారామ కల్యాణ మహోత్సవం


లలితా పీఠంలో కల్యాణం తిలకిస్తున్న భక్తులు


శాంతినగర్ సీతారామాలయంలో పూజలు చేస్తున్న డిప్యూటీ మేయర్ కటుమూరి సతీష్


నార్త్ ఎక్స్‌టెన్షన్ ఆలయంలో కల్యాణం జరిపిస్తున్న అర్చకుడు రామారావు శర్మ


మురళీనగర్ రామాలయంలో సీతారాముల కల్యాణం


దాసాంజనేయస్వామి ఆలయం వద్ద సీతారాములు


రెడ్డి తాటిచెట్లపాలెంలో శ్రీరామనవమి వేడుకల్లో పాల్గొన్న కె.కె.రాజు, పార్టీ నాయకులు


వానప్రస్థ వృద్ధాశ్రమంలో సీతారాముల కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు


గణేష్‌నగర్ ఆలయంలో రామయ్య కల్యాణం